క్లుప్తంగా

రూ.కోటితో డ్రెయిన్ నిర్మాణానికి శంకుస్థాపన

నేడు కానూరులో పనులు ప్రారంభం

పెనమలూరు: తాడిగడప మునిసిపాలిటీ పరిధి కానూరులో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి శనివారం శంకుస్థాపన చేయనున్నారు. పూర్తైన రోడ్లు, సెంట్రల్ లైటింగ్, రోప్ లైటింగ్ ప్రారంభించనున్నారు. కమిషనర్ ఎస్.ప్రకాశరావు శుక్రవారం వీటి వివరాలను వెల్లడించారు. కానూరులో తూర్పు బజార్‌లో డ్రెయిన్ నిర్మాణానికి రూ.50 లక్షల వ్యయ అంచనాతో ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి శంకుస్థాపన చేస్తారన్నారు. పెద్ద మసీదు వద్ద రూ.36 లక్షలతో సీసీ రోడ్డు, రేకుల మసీదు వద్ద రూ.15 లక్షలతో రోడ్డుకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. సనత్‌నగర్ రామాలయం వద్ద రూ.23 లక్షలతో నిర్మించిన రోడ్లు, రూ.37 లక్షలతో పోలీస్‌స్టేషన్ నుంచి సనత్‌నగర్ వరకు పంటకాలువ రోడ్డులో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్, రోప్ లైటింగ్ ఎమ్మెల్యే ప్రారంభిస్తారని కమిషనర్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నవరం: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం మండలంలోని కేసరపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల కార్యనిర్వాహక ఇంజినీర్ పి.హరిబాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కేసరపల్లి గ్రామంతో పాటు ఎస్ఎల్‌వీ విల్లాస్, అప్పారావుపేట, అజ్జంపూడి, బుద్ధవరం, బూతుమిల్లిపాడు, జక్కులనెక్కలం జగనన్న కాలనీ, వీఎస్.పురం కాలనీల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

పెనమలూరులో 284 మంది కౌలు రైతులకు 'భరోసా'

పెనమలూరు: మండల పరిధిలో కౌలు కార్డులు ఉన్న 284 మంది కౌలు రైతులకు ప్రభుత్వం రైతుభరోసా సాయం అందించింది. మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ శుక్రవారం వివరాలు తెలిపారు. 284 మంది కౌలు రైతులు రైతుభరోసాకు అర్హత సాధించారన్నారు. చోడవరంలో 35 మంది, గంగూరులో 32, గోసాలలో 25, కానూరులో 5, పెదపులిపాకలో 57, పెనమలూరులో 48, పోరంకిలో 23, తాడిగడపలో 24, వణుకూరులో 23, యనమలకుదురులో 12 మందికి రైతుభరోసా అందింది.

అంతర్గత రోడ్ల అభివృద్ధికి చర్యలు

కంకిపాడు: అంతర్గత రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు కందలంపాడు సర్పంచ్ బాయిరెడ్డి నాగరాజు తెలిపారు. కందలంపాడులో మండల పరిషత్ నిధులు రూ.7 లక్షలు, జెడ్పీ నిధులు రూ.5 లక్షల వ్యయ అంచనాతో ఐదు సిమెంటు రోడ్ల నిర్మాణ పనులను శుక్రవారం చేపట్టారు. సర్పంచ్ బాయిరెడ్డి నాగరాజు, పాలకవర్గ ప్రతినిధులు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పాలకవర్గ ప్రతినిధులు సలోమి, కోటేశ్వరమ్మ, పుణ్యవతి, పార్టీ నేతలు కొత్తూరు జాన్, వర్రె మధు, కవిలికట్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తిపై కేసు

పెనమలూరు: కానూరు శివారులో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కానూరు సనత్‌నగర్ రామాలయం ప్రాంతానికి చెందిన తిరుమలశెట్టి దుర్గారావు కానూరు శివారులో సంచరిస్తున్నాడు. రౌండ్స్‌లో ఉన్న పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా సరైన సమాధానం చెప్పలేదు. అతని వివరాలను పోలీసులు పరిశీలించగా పెనమలూరు, కంకిపాడు, పటమట పోలీస్‌స్టేషన్లలో పలు గంజాయి కేసులు నమోదైనట్లు గుర్తించారు. అతనిపై బైండోవర్ కేసు నమోదు చేశారు.



పేదలకు అండగా జగనన్న


నున్నలో పింఛన్ అందజేస్తున్న వలంటీరు సునీత


పెనమలూరులో వెంకటకృష్ణకు వికలాంగ పింఛన్ అందజేస్తున్న వలంటీర్ చంద్రకాంత్


పెనమలూరులో కొత్త పింఛన్లు అందజేస్తున్న సర్పంచి భాస్కరరావు


మణిపాల్ ఆస్పత్రిలో పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ ఖలీల్ రెహమాన్

పెనమలూరు: పేదలకు అండగా జగనన్న ఉన్నారని పెనమలూరు సర్పంచి లింగాల భాస్కరరావు అన్నారు. గ్రామంలో శుక్రవారం వైఎస్సార్ పింఛన్ కానుక పథకంలో భాగంగా గ్రామంలో కొత్తగా మంజూరైన పింఛన్లు ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సర్పంచి మాట్లాడుతూ మండలంలో మొత్తం 426 కొత్త పింఛన్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీపై ప్రతిపక్షాలు అసత్య ప్రచారం చేస్తున్నాయని, ఆ తప్పుడు ప్రచారాన్ని ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఈవో పద్మావతి దేవి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

విజయవాడ రూరల్ మండలంలో 80 శాతం పింఛన్లు పంపిణీ

విజయవాడ రూరల్: విజయవాడ రూరల్ మండలంలో ఒకటో తేదీ శుక్రవారం 80 శాతం మంది లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసినట్టు ఇన్‌చార్జి ఎంపీడీఓ బీఎల్‌వీ శేషగిరిరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రభుత్వం ఈ నెలలో 368 మంది లబ్ధిదారులకు కొత్తగా పింఛన్లు మంజూరు చేసిందన్నారు. వాటితో మొత్తం 16,746 మంది లబ్ధిదారులకు 4, 66, 53, 500 విడుదల కాగా వాటిలో 80 శాతం పంపిణీ చేశారు.

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలంలోని పలు గ్రామాల్లో వృద్ధాప్య, ఒంటరి మహిళ, దివ్యాంగ పింఛన్లు కలిపి రామవరప్పాడులో 90 శాతం, ఎనికేపాడులో 92 శాతం, కొత్తవి -19, ప్రసాదంపాడులో 93శాతం, కొత్తవి- 47, నిడమానూరులో 70 శాతం, కొత్తవి-30 పంపిణీ చేశారు. తొలి రోజు అన్ని గ్రామాలు కలిపి 88 శాతంపైగా పంపిణీ పూర్తి చేశారు.

పెనమలూరు: మండల పరిధిలో మొత్తం 18,120 పింఛన్లు ఉండగా ప్రభుత్వం రూ 5 కోట్ల నిధులు మంజూరు చేసింది. తాడిగడప మున్సిపాలిటీలో 12,514 మంది, పెనమలూరు మండలంలో 5,606 మందిలో దాదాపు 80 శాతం పింఛన్లు పంపిణీ చేశారు. పెనమలూరు 3వ సచివాలయం పరిధిలో నాలుగేళ్లుగా పక్షవాతంతో బాధపడుతున్న హరికట్టు వెంకటకృష్ణారావుకు వికలాంగుల పింఛన్ సొమ్మును వలంటీర్ చంద్రకాంత్ అందచేశారు.

ఉయ్యూరు: ఉయ్యూరు మున్సిపాలిటీ, మండలంలోని 11 గ్రామాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛను అందజేశారు. మున్సిపాలిటీలోని 20 వార్డుల్లో కొత్తగా మంజూరైన పింఛన్లను మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని), వైస్ చైర్మన్‌లో సోలే సురేష్ బాబు, అర్షతున్నీసాబేగం, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, ఆయా వార్డు కౌన్సిలర్లు అందించారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛను అందజేసిన వలంటీర్

గన్నవరంరూరల్: వలంటీర్ల సేవలకు సర్వత్రా ప్రశంసలు లభిస్తున్నాయి. మండలంలోని ముస్తాబాద గ్రామంలో సచివాలయం-1లో వలంటీర్‌గా పని చేస్తున్న అబ్దుల్ ఖలీల్ రెహమాన్‌ను శుక్రవారం పలువురు అభినందించారు. ఆ గ్రామానికి చెందిన వృద్ధాప్య పెన్షన్ లబ్ధిదారు మోరం రాధాకృష్ణ గుండె సంబంధిత వ్యాధితో తాడేపల్లి మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా విషయం తెలుసుకుని అక్కడికి వెళ్లి పెన్షన్ అందజేశారు. వలంటీర్ సేవలను వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ జె.నానారావు, సచివాలయం సిబ్బంది, సహచర వలంటీర్‌లు అభినందించారు.

రంగన్నగూడెం దళితులపై టీడీపీ దాడి అమానుషం

ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్


మీడియాతో మాట్లాడుతున్న ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్

హనుమాన్‌జంక్షన్ రూరల్: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో రంగన్నగూడెం దళితులపై విచక్షణారహితంగా దాడి చేయటం అమానుష చర్య అని ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ అన్నారు. రంగన్నగూడెంలో టీడీపీ నేతల దాడిలో గాయపడిన దళితులను శుక్రవారం ఆయన పరామర్శించారు. దాడి ఘటన వివరాలను బాధితులను అడిగి తెలుసుకున్నారు. దాడికి పాల్పడిన వ్యక్తులు ఏ స్థాయి వారైనా ఉపేక్షించే ప్రసక్తి లేదన్నారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఇటీవల వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలో చేరిన యార్లగడ్డ వెంకట్రావు ప్రోద్బలంతోనే రంగన్నగూడెంలో దాడి జరిగిందని, ఆయనతో పాటు పార్టీ మారలేదనే అక్కసుతో దాడి చేయించారని బాధితులు వాపోయారు. ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, సర్పంచ్ సరిపల్లి కమలాబాయి తదితరులు పాల్గొన్నారు.

• సర్వే పనుల పరిశీలన

గన్నవరంరూరల్: మండలంలోని కొండపావులూరు గ్రామంలో జరుగుతున్న వైఎస్సార్ జగనన్న శాశ్వత భూరక్ష, భూహక్కు పథకం సర్వే పనులను శుక్రవారం డివిజనల్ డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే నరసింహారావు, మండల సర్వేయర్ మాధవరావు పరిశీలించారు. వీఆర్వో చందన శ్రీనివాస్, సర్వేయర్ కిషోర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ పూజలు


గాజుల అలంకరణలో పేరంటాలమ్మ

కంకిపాడు: దావులూరు గ్రామంలోని శివాలయంలో భ్రమరాంబ అమ్మవారు గాజుల అలంకారంలో ప్రత్యేకంగా దర్శనమిచ్చారు. భక్తులు సామూహిక కుంకుమ పూజలు చేశారు. పూజా కార్యక్రమాలను గూడూరు శ్రీనివాస ప్రసాద శర్మ, మహీధర్ పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని చంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామి దేవస్థానంలో ఆలయ ట్రస్టీ మొక్కపాటి శర్మ ఆధ్వర్యంలో మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. దేవదాయశాఖకు చెందిన శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో లక్ష్మీదేవి అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు చేసి పూజలు చేశారు. చెరువు సెంటర్లోని శ్రీకనకదుర్గ ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. అంబాపురం గ్రామంలో శ్రీకనకదుర్గ గుడిలో లక్ష్మీదేవికి ప్రత్యేకమైన అలంకారాలు చేసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

లక్ష్మీ తిరుపతమ్మ ఆలయంలో..

గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో శ్రావణమాసం మూడవ శుక్రవారం సందర్భంగా లక్ష తులసి అర్చన ఘనంగా నిర్వహించారు. మాజీ సర్పంచి గూడపాటి తులసీమోహన్, సుజాత దంపతులు, కాసర్నేని లలిత సౌజన్యంతో శ్రీలక్ష్మీతిరుపతమ్మకు లక్ష తులసి దళాలతో అర్చన భక్తిశ్రద్ధలతో జరిపారు. ఉప సర్పంచి పాలడుగు వెంకటరామవరప్రసాద్(నాని), అనంతలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన చేశారు. కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

గాజుల అలంకరణలో దర్శనమిచ్చిన పేరంటాలమ్మ

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో అమ్మవార్లు శుక్రవారం గాజుల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ అలంకరణ నిమిత్తం గ్రామంతో పాటు చుట్టు పక్కల గ్రామాల భక్తులు అమ్మవార్లకు గాజులు బహూకరించారు. ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు తరలివచ్చి పేరంటాలమ్మను దర్శించుకున్నారు. పలువురు మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బోయిన భాను ప్రదీప్, ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• వైఎస్సార్ కంటి వెలుగుతో ఆరోగ్య రక్ష

ఉయ్యూరు: వైఎస్సార్ కంటి వెలుగుతో పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం రక్షణ కల్పిస్తోందని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) అన్నారు. పట్టణంలోని 2వ వార్డులో శుక్రవారం వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. కంటి వెలుగు శిబిరాన్ని చైర్మన్ వల్లభనేని నాని, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, వైద్యాధికారి తేజస్విని సందర్శించి కంటి వెలుగు శిబిరం వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వణుకూరు సుభద్రాదేవి, కో ఆప్షన్ సభ్యుడు షేక్ ఖలీల్, ఆప్తాలమిక్ ఆఫీసర్ వి.వి. రాజేష్‌కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ కొలుసు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

• మిడ్ డే మీల్‌కు గ్యాస్ సిలిండర్లు ఇవ్వాలి

గన్నవరం: మధ్యాహ్న భోజన పథకం అమలుకు అవసరమైన గ్యాస్ సిలిండర్లను ప్రభుత్వమే సరఫరా చేయాలని వంట ఏజెన్సీల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గండికోట సమ్మక్క అన్నారు. స్థానిక సీపీఎ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్న భోజన పథకం వంట ఏజెన్సీ కార్మికుల సంఘం సమావేశం నిర్వహించారు. సీఐటీయూ నేతలు కె.వెంకటేశ్వరరావు, పిల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

• నేడు ఉచిత వైద్యశిబిరం

పెనమలూరు: యనమలకుదురులో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని వైఎస్సార్ సీపీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు గుమ్మడి విజయ్‌కుమార్ తెలిపారు. ఆయన శుక్రవారం వివరాలు తెలుపుతూ వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా శంకర నేత్ర చికిత్సాలయం సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం శనివారం ఉదయం 9 గంటలకు సంజీవయ్యనగర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

• నూర్‌బాషాలు, దూదేకుల అభ్యున్నతికి తోడ్పాటు

గన్నవరం: నూర్‌బాషాలు, దూదేకుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల తోడ్పాటును అందిస్తున్నట్లు ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు పులిమర్ది చిన్నమస్తాన్ తెలిపారు. మండలంలోని దావాజిగూడెంలో శుక్రవారం నూర్‌బాషా, దూదేకుల ముస్లిం మైనారిటీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగా నియమితులైన నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ నాగూర్ సాహెబ్, ప్రధాన కార్యదర్శి షేక్ రహింతుల్లా, ఉపాధ్యక్షులు షేక్ మీరావలి, ప్రచార కార్యదర్శి షేక్ శ్రీనివాసరావు, మహిళా ఉపాధ్యక్షురాలు హుస్సేన్‌బీకు ఉత్తర్వులను అందజేశారు. మహిళా విభాగం ఉంగుటూరు మండల అధ్యక్షురాలిగా ఎస్‌కే పీర్‌బీ, ఉపాధ్యక్షురాలిగా మస్తాన్‌బీ, బాపులపాడు మండల అధ్యక్షురాలుగా షేక్ లాల్‌బీకి నియామక ఉత్తర్వులను అందించారు.

• ఘనంగా హనుమాన్ జన్మనక్షత్ర పూజలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమాన్ జన్మనక్షత్రం పూర్వాభాద్రను పురస్కరించుకుని శుక్రవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం దాత పోట్ల వెంకటేశ్వరరావు (సీతారామపురం) ఆర్థికసాయంతో భక్తులకు అన్నదానం నిర్వహించారు. దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గాప్రసాద్, ఆలయ పాలకమండలి చైర్మన్ నెరుసు భూషణం, ఈవో కూచిపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

• కొనసాగుతున్న ఫాతిమా మాత నవదిన ప్రార్థనలు

ఉంగుటూరు: మండలంలోని పెద అవుటపల్లిలో బ్రదర్ జోసఫ్ తంబి పుణ్యక్షేత్రంలో ఫాతిమా మాత నవదిన ప్రార్థనలు మూడవ రోజు కొనసాగుతున్నాయి. పలువురు ఫాదర్లు మఠకన్యలు, సంఘస్తులు పాల్గొన్నారు.







